క్లుప్తంగా

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

గణపవరం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా వాడాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి అన్నారు. గురువారం గణపవరం పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. సుమారు 76 మంది గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రతీ నెలా 9, 10 తేదీల్లో గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు చేస్తారని వివరించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ గర్భిణులు ఆకుకూరలు ఎక్కువగా వాడాలని, తాజా పండ్లు తినాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో అమృతకు ద్వితీయ స్థానం



సిరిసెట్టి అమృత, ద్వితీయస్థానం విజేత

నిడమర్రు: ఈ నెల 11న ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పత్తేపురం జెడ్పీ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని సిరిసెట్టి అమృత లక్ష్మీసాయి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో-1 పుచ్చల శేషు తెలిపారు. శుక్రవారం ఏలూరు జిల్లాలో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటుందన్నారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ సుబ్బరాజును, ఎంఈవో-2 జి.బాలయ్య, హెచ్ఎం సత్యనారాయణ, తదితరులు అభినందించారు.

గోనె సంచుల సరఫరా



ముందస్తుగా గ్రామానికి చేరిన గోనె సంచులు

దెందులూరు: రైతులు పండించిన పంటలను తరలించేందుకు 5 వేల గోనె సంచులను సరఫరా చేయడం జరిగిందని గాలాయగూడెం గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముందస్తు చర్యల్లో భాగంగా ఈ వ్యవసాయ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ శివారు ప్రాంతాల పరిధిలో రైతుల వ్యవసాయ ఉత్పత్తులు చేర్చేందుకు ఐదువేల గోనె సంచులు గ్రామానికి రావడం సంతోషంగా ఉందని విషయాన్ని రైతులందరికీ తెలియజేస్తామన్నారు.

అంకితభావంతోనే గుర్తింపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: ఏ రంగంలోనైనా నిరంతర సాధన, అంకితభావం, క్రమశిక్షణ విజయానికి సోపానాలని గోపన్నపాలెం శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయ ఉత్సవ కమిటీ తోట రామకృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు అన్నారు. గురువారం కనకదుర్గమ్మ తల్లి ఆలయ ఆవరణలో విశిష్ట ప్రతిభతోపాటు దసరా ఉత్సవాల్లో సాంస్కృతి కార్యక్రమాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతులను చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులను వారి తల్లిదండ్రులను ఆలయ కమిటీ అభినందించింది.

గోపన్నపాలెంలో కనకదుర్గమ్మ గ్రామోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

దెందులూరు: గోపన్నపాలెం గ్రామంలో గురువారం దసరా ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు తోట రామకృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలో వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

గేటు నిర్మాణం

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడి ఉన్నత పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో భాగంగా మంజూరైన నిధులు వెచ్చించి పాఠశాల లోపలికి వచ్చే ప్రహరీ గోడకు గేటును ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలో మూడు వైపులా ప్రహరీగోడ నిర్మాణం చేశారు.

పండుగకు పప్పన్నం లేనట్టే..!

- నియోజకవర్గంలో రేషన్ దుకాణాలకు చేరని కందిపప్పు
- నేటి వరకూ 20 శాతమే రాయితీ కందిపప్పు సరఫరా
- బియ్యం పంపిణీ తర్వాత రావడంతో డీలర్ల విముఖత
- వచ్చేనెలలో అందిస్తామంటున్న అధికారులు
- బయటి మార్కెట్లో కిలో రూ.180 పలుకుతున్న ధర



బువ్వనపల్లిలో బియ్యం మాత్రమే తీసుకుంటున్న కార్డుదారులు

నిడమర్రు: కూటమి ప్రభుత్వంలో దసరా పండగ వేళ పేదలకు పప్పన్నం తినే యోగం లేకుండా పోయింది. నిత్యావసర సరుకుల ధరలు రాకెట్‌లా దూసుకెళ్తుండటంతో పేదలు ఓ పూట పస్తులుండాల్సిన దుస్థితి. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, కందిపప్పు, చెక్కర తదితర నిత్యావసర సరుకులు ఇస్తామని పౌరసరఫరాల శాఖా మంత్రి గొప్పగా ప్రకటించి మూడు నెలలు దాటినా ఆచరణలో మాత్రం ఫలితం శూన్యం. ప్రభుత్వమే రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై చెక్కర, కందిపప్పును పంపిణీని ఈ నెల 1వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. అయితే ఇప్పటి వరకూ 20 శాతం మాత్రమే డీలర్లకు పంపిణీ చేయడంతో పూర్తిస్థాయిలో కార్డుదారులకు కందిపప్పు అందక పోవడంతో రేషన్‌కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు సరఫరాలో కోత విధించడంతో



సబ్సిడీ కందిపప్పు ప్యాకెట్లు

గ్రామాల్లో కొంతమంది డీలర్లు తమకు నచ్చిన కార్డుదారులకు వచ్చిన కందిపప్పు పంపిణీ చేసినట్లు కార్డుదారులు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌లో రూ67 కే కంది పప్పు ఇస్తారని ఆశించిన పేదలకు భంగపాటు తప్పలేదు. బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.150 నుంచి రూ.180 పెట్టి కొనుగోలు చేయలేమని, పండగనాడూ పచ్చమెతుకులతో పరిపెట్టికోక తప్పదని పేదలు తమను తాము నిందించుకుంటున్నారు.

నిడమర్రు మండలానికి 500 ప్యాకెట్లు మాత్రమే

నిడమర్రు మండలంలో 31 రేషన్ దుకాణాలు ఉండగా 15,480మంది లబ్ధిదారులు ఉన్నారు. తొలివిడతగా 10 రేషన్ వాహనాలకు 10 బస్తాలు చొప్పున 500 కిలోలు మాత్రమే మండలానికి అందజేసినట్లు డీలర్లు చెబుతున్నారు. తర్వాత మరో 15 శాతం వరకూ కందిపప్పు ప్యాకెట్లు కొంత మంది డీలర్లుకు మాత్రమే అందాయి. భీమడోలులోని ఎంఎల్ పాయింట్ గొడౌన్ వద్ద కూడా పూర్తిస్థాయిలో కందిపప్పు కిలో పేకెట్స్ లేకపోవడంతో, రేషన్ దుకాణాల నిర్వహకులు పదే పదే తెచ్చుకోవాలంటే ఆర్థిక భారంతోపాటు అధికారుల స్టాంపుల కోసం పదే పదే తిరగలేక పోడంతోపాటు గ్రామాల్లో కొందరికి కందిపప్పు ఇచ్చి మరి కొందరు లబ్ధిదారులకు కందిపప్పు ఆపితే వివాదాలకు దారితీస్తుందన్న ఉద్దేశ్యంతో డీలర్లు ససేమీరా అనడంతో కంది పప్పు ఎంఎల్ పాయింట్ గోడౌన్‌లోనే ఉండిపోయింది.

అమ్మవారి ప్రసాదంలో కందిపప్పు

10 రోజుల పాటు ఘనంగా సాగే దసరా పండగలో అమ్మవారికి నైవేద్యాలు పెట్టాలంటే చెక్కర, బియ్యంతోపాటు కందిపప్పు కచ్చితంగా అవసరం, ఇంటింటికి తిరిగే వాహనాల ద్వారా బియ్యమైతే ఇస్తున్నారు. కొంత మంది డీలర్లు బియ్యంతోపాటు కందిపప్పు, చెక్కర పంపిణీ చేసినట్లు వారితో సమోదు చేసుకుంటున్నట్లు లబ్ధిదారుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చిన కందిపప్పు ఎస్సీ ఎస్టీ కార్డుదారులకు మాత్రమే అంటూ కొంత మంది డీలర్లు చెబుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో పండగలో అమ్మవారి ప్రసాదాలకోసం అవసరమైన కందిపప్పును బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయక తప్పడంలేదని లబ్ధిదారులు చెబుతున్నారు.

కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం



ఈనెలలో దసరాతోపాటు దీపావళి పండగ ఉంది. ఒకే నెలలో రెండు పండగలున్నా కార్డుదారులకు కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం. కేంద్రం పంపే బియ్యంతో సరిపెడుతున్నారు. పూర్తి స్థాయిలో కందిపప్పు ఇవ్వడంలేదు. ఇప్పడేమో ఒక్కో డిపోకి 50 నుంచి 150 కిలోలు మాత్రమే ఇవ్వడంతో అది ఒక్క పూటలోనే అయిపోందని డీలర్లు అంటున్నారు. మిగిలిన లబ్ధిదారులకు ఎప్పుడు ఇస్తారో వారి వద్ద స్పష్టమైన సమాధానం లేదు. కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుంది.

– బండి రమణ విస్సాకు, వైఎస్ ఎంపీపీ, నిడమర్రు

ఇంటింటికీ అన్ని సరుకులూ ఇవ్వాలి



దసరా పండుగ నేపథ్యంలో ఇంటింటికి తిరిగే రేషన్ పంపిణీ వాహనాల ద్వారా పూర్తి సరుకు లు అందించాలి. వచ్చేనెల కంది పప్పు ఇవ్వడం వల్ల పండగలో అవసమైన కందిపప్పు కొనుగోలు చేసుకోవలంటే బహిరంగ మార్కెట్లో 180 రూపాయలకు పైగా కొనుక్కోవల్సిందే. ప్రభుత్వం చెపుతున్న సబ్సిడీ కంది పప్పు పై కోత విధించినట్లే అవుతోంది. బయట ధరలు మండి పోతున్న తరుణంలో ప్రభుత్వం పేదలకు మేలు చేసేందుకు ప్రయత్నించాలి. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బేవర లక్ష్మీ తులసి, పెదనిండ్రకొలను

వచ్చే నెలలో కందిపప్పు ఇస్తాం

మండలంలో 31 రేషన్ దుకాణాల్లోని మొత్తం సరుకులు లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపిణీకి 10 రేషన్ సరఫరా వాహనాలు ఉన్నాయి. ముందుగా బియ్యం రావడంతో పంపిణీ ప్రారంభించాము.తర్వాత కందిపప్పు సరఫరా 20 శాతం మేర అందడంతో ఆ మొత్తం ప్యాకెట్స్‌ను పంపిణీ చేసాం. ప్రస్తుతానికి రేషన్ సరఫరా వాహనాలు బియ్యం పంపిణీ పూర్తి చేయడంతో వచ్చేనెలలో బియ్యంతో పాటు కందిపప్పు కూడా నూరుశాతం లబ్ధిదారులకు ఇచ్చేందుకు కృషి చేస్తాం.

– జరీనా బేగం, డీటీ, సివిల్ సప్లై

14 నుంచి 18 వరకు శంకుస్థాపన వారోత్సవాలు



ఎంపీడీఓ కే.శ్రీదేవి

దెందులూరు: మండలంలో ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు అభివృద్ధి పనులు, శంకుస్థాపన వారోత్సవాలు జరుగుతాయని దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రోటోకాల్ పాటిస్తూ నూరు శాతం విజయవంత అయ్యేందుకు ప్రణాళిక సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కారం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా జరుగుతున్న ఈ ప్రారంభోత్సవాల శంకుస్థాపన జరిగే సమయం షెడ్యూల్‌లో మండలపరిషత్ కార్యాలయం నుంచి సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు.

లక్ష్మణస్వామి మరణం తీరని లోటు



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర

గణపవరం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహకార ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకిన లక్ష్మణస్వామి మరణం సహకార సంఘాల ఉద్యోగులకు తీరని లోటని తాడేపల్లిగూడెం డివిజినల్ సహకార అధికారి నరేంద్రకుమార్ అన్నారు. ఇటీవల మరణించిన లక్ష్మణస్వామి సంతాప సభలో ఆయన మాట్లాడుతూ సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సహకార సంఘాల బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి కార్యదర్శి దేవదాసు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేవీ రామలక్ష్మి, రవి కుమార్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదలి వచ్చిన కనకదుర్గమ్మ

పలు రూపాల్లో దుర్గమ్మ దర్శనం



ఉంగుటూరు: శివాలయంలో జ్యోతిర్లింగార్చన నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు భీమేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు గురు వారం దుర్గదేవి అలంకరణలో కనిపించారు. ఆయల ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన దీపాలు వెలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణం హనుమంతురావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వంతెన వద్ద రామాలయంలో, తూర్పు కాపుల రామాలయం వద్ద, చిన్న చల్లాలమ్మ ఆలయం వద్ద, నారాయణపురం సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద దేవీ నవరాత్రి పూజలు చేస్తున్నారు. యర్రమళ్ల, నాచుగుంట కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.

ఎనిమిదో రోజు ఉత్సవాలు

నిడమర్రు: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అష్టమి పురష్కరించుకొని బువ్వనపల్లి, పెదనిండ్రకొలను, అడవికొలను, చానమిల్లి, పత్తేపురం గ్రామాల్లోని దసరా వేదికల వద్ద దుర్గాదేవి అలంకారంలోనూ, మందలపర్రు ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని ఉమాదేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

గణపవరం: దుర్గాష్టమి సందర్భంగా గురువారం కనకదుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో వాసవీ మాతకు ప్రత్యేక అలంకరణలు చేసి పల్లకి ఉత్సవం నిర్వహించారు. బాలయ్య చెరువు వద్ద గల కంచి కామాక్షి కనకదుర్గ అమ్మవార్ల ఆలయంలో అమ్మవార్లకు మహా నైవేద్యం సమర్పించారు. చినరామచంద్రపురం కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

దుర్గాదేవిగా అమ్మవారు

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం భక్తులకు అమ్మవారు వివిధ రూపాలల్లో దర్శనమిచ్చారు. చలువ పందిళ్లల్లో కొలువైన అమ్మవార్లను, ఆలయాల్లోని అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని విశేష పూజలు చేశారు. ఆలయాల్లో స్వామి వారికి పంచామృత అభిషేక పూజలు, లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎం పురం, భీమడోలు, నరెడ్లగూడెం తదితర గ్రామాల్లోని



నిడమర్రు: గాయత్రీదేవి అలంకరణలో ఉమాదేవి

దుర్గామాతను దర్శించుకున్నారు. గుండుగొలనులోని శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు శ్రీభవానీమాత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కురెళ్లగూడెంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారి ఎదురుగా శివలింగాలను ఉంచి బంతి పూలతో మందిరాన్ని ముస్తాబు చేశారు. భీమడోలు గోదావరి కాలువ గట్టుపై వేంచేసియున్న అమ్మవారి భారీ విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. గుండుగొలనులోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



గణపవరం: కంచికామాక్షి కనకదుర్గ అమ్మవార్లకు సమర్పించిన మహా నైవేద్యం



భీమడోలు: దుర్గాదేవిగా శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి

దాడులకు భయపడొద్దు



పార్టీ జిల్లా అధ్యక్షులు డీఎన్నార్‌ను కలిసిన లీలానవకాంతం గంగరాజు

దెందులూరు : కూటమి ప్రభుత్వ నాయకులు, అనుచరులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలకు వేధింపులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడవద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు సూచించారు. గురువారం ఆయన్ని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పార్టీ నేత నిట్టా గంగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. తమను, తమ కుటుంబాలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని అభివృద్ధికి సంబంధించి శిలాఫలకాలు ఛిద్రం చేశారని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకే కూటమి ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని డీఎన్నార్ ఆరోపించారు. ఏకంగా దేవుడు ప్రసాదంపై తప్పుడు సమాచారాన్ని ఇవ్వడంపై త్వరలోనే ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పటం ఖాయమని అన్నారు.

ఏలూరులో ఆటోలతో ర్యాలీ

సమస్యలపై కలెక్టర్, ఎస్పీలకు వినతి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పట్టణం, రూరల్ ఆటో కార్మికులకు, హనుమాన్ జంక్షన్ అప్పనవీడు ఆటో కార్మికులకు మధ్య వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏలూరు పాత బస్టాండ్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సమస్యలపై కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు పట్టణం, రూరల్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు లీలా కృష్ణ, గౌరవ అధ్యక్షుడు గూడవల్లి శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఏలూరు పట్టణం, రూరల్ ఆటో కార్మికులు 5000 మంది ఏలూరు నగరం నుంచి అనేక ప్రాంతాలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కార్మికులుగా పనిచేస్తున్నట్టు చెప్పారు. హనుమాన్ జంక్షన్ అప్పన్నవీడు నుంచి ఏలూరు వచ్చే ఏలూరు నగర ఆటో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఏలూరు నగరంలోని మెయిన్ బజార్, కర్ర వంతెన, బిర్లభవన్ సెంటర్, రైతు బజార్, వసంత మహల్, ఫైర్ స్టేషన్, జూట్ మిల్, కొత్త బస్టాండ్ మీదుగా వారికి ట్రాన్స్‌పోర్టు సౌకర్యం సక్రమంగా లేదని చెప్పారు. ఐనా ఏలూరు ఆటో కార్మికులపై దుశ్చర్యలకు పాల్పడడం సరికాదని అన్నారు. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికుల మధ్య వచ్చే వివాదాల పరిష్కారానికి కార్మిక సంఘాలు ప్రయత్నించాలని సూచించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అధికారులకు ఫిర్యాదులు చేసి కార్మికులను రెచ్చగొట్టే ఆలోచనకి వెళ్లవద్దని వారికి విజ్ఞప్తి చేశారు.

ప్రతి వ్యక్తికీ మానసిక ఆరోగ్యం ప్రధానం

దెందులూరు: మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలంటే ఎప్పటి పనిని అప్పుడే పూర్తి చేయాలని గోపన్నపాలెం వైద్యాధికారిణి రోజ్ లలిత అన్నారు. గురువారం గోపన్నపాలెం ప్రాథమిక వైద్యానికి కేంద్రంలో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ఎంతో ముఖ్యమన్నారు. మానసిక ఆరోగ్యానికి కంటి నిండా నిద్ర ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు ఒకే సమయానికి నిద్రపోవడం, నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలన్నారు. కోఆర్డినేటర్ డీ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆలోచనలు, ఆచరణలు అన్ని మెదడుపైనే ఆధారపడి ఉంటాయని మెదడే గనక లేకుంటే ఇంజన్ లేని రైలు, దారం లేని గాలిపటం అవుతుందన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు గోపన్నపాలెం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి, దోమలను నిర్వీర్యం చేయడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి వంటి పలు రకాల అంటువ్యాధులను అరికట్టొచ్చని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు సూచించారు. గురువారం గణపవరం మండలం కేశవరంలో పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దోమల నిర్మూలన, అంటువ్యాధుల నిరోధక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలు, రిఫ్రిజిరేటర్స్, వాటర్ కూలర్స్, నీటి నిల్వలు ఉంచే తొట్టెలు, ప్లాస్టిక్ డబ్బాలు, మురుగు డ్రెయిన్లలో దోమల లార్వాను ప్రజలకు చూపించి దోమ వ్యాప్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఘంటసాల వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి శ్రీదేవి, ఆరోగ్య సహాయకులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన జీతాలు ఇప్పించండి



ఏలూరులో డీపీవో అనురాధను కలిసిన ఈ-పంచాయితీ కంప్యూటర్ ఆపరేటర్ల వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

భీమడోలు: ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుకు జీతాలు పెంచుతూ ఇచ్చిన జీవోను క్షేత్రస్థాయిలో అమలయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా డీపీవో కె.అనూరాధను కంప్యూటర్ ఆపరేటర్ల వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందించారు. ఏలూరులోని డీపీవో కార్యాలయంలో జిల్లా డీపీవో కె.అనురాధను సొసైటీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బీఎస్ దుర్గారావు, కోశాధికారి కె.లావణ్య, కార్యదర్శులు డి.ఆదిత్య, ఎస్.వల్లిబాబా, జి.ధర్మతేజ కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను డీపీవో దృష్టికి తీసుకెళ్లారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ-పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు జీతాలను రూ.15 వేల నుంచి రూ.18,500లకు పెంచుతూ పంచాయతీ రాజ్ కమీషనర్ ఉత్వర్వులు జారీ చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలలో 233 మంది ఆపరేటర్లు పని చేస్తున్నారని తెలిపారు. మూడు నెలలు గడుస్తున్నా నేటికి ఉత్తర్వులు అమలు చేయలేదని వాపోయారు. డీపీవో సానుకూలంగా స్పందించారని వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

రతన్ టాటా మరణం తీరని లోటు

గణపవరం: భారతదేశ పారిశ్రామిక దిగ్గజం, పద్మవిభూషణ్ రతన్ టాటా మరణం దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటని అఖిల భారత హేండ్లూమ్స్ మాజీ డైరక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. రతన్‌టాటా మరణం పట్ల ఆయన ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. ఉప్పు నుంచి విమానాల వరకూ అనేక రంగాల్లో విజయవంతంగా సాగిన టాటా గ్రూపు లక్షల మందికి ఉపాధి కల్పించిందన్నారు. దేశానికి, సమాజానికి ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.